బీకేఎం బైబిల్ కాలేజీ ప్రారంభం


మాట్లాడుతున్న రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీకేఎం బైబిల్ కాలేజీని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఏసు క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు అనుసరించేలా, నీతి వంతమైన జీవితాన్ని కొనసాగించేలా శిక్షణ ఇచ్చేందుకు కాలేజీ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీకేఎం చర్చ్ పాపిరెడ్డినగర్ పాస్టర్ డానియల్, పాస్టర్ అమ్మ, ఇమ్మానుయేల్, ఏసుపాదం, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్ పార్కు కాలనీ డబుల్ బెడ్రూమ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం రాత్రి ఆవిష్కరించారు. విగ్రహదాత తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌తో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. దళితులు, బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పరిశోధక ప్రయోగానికి బ్రేక్‌త్రూ బహుమతి

రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సీఏఎస్ఈఎల్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రయోగానికి బ్రేక్‌త్రూ బహుమతి లభించింది. సీఏఎల్ఈఎల్‌టీలోని ఫ్యాకల్టీ డాక్టర్ భావనాగోంబర్ నేతృత్వంలోని బృందం ఈ మైలురాయి శాస్త్రీయ విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. విశ్వం యొక్క ప్రాథమిక స్వభావం గురించి అవగాహనను విస్తరించిన సీఈఆర్ఎన్‌లో పనిచేస్తున్న అంతర్జాతీయ శాస్త్రవేత్తల అత్యుత్తమ సహకారాన్ని బ్రేక్ త్రూ బహుమతి గుర్తిస్తుంది. కాగా డాక్టర్ భావనాగోంబర్ నాయకత్వంలోని బృందంలో బిస్నుప్రియసాహు, శ్రీనికేతన్ ఆచార్య నిర్వహించిన డార్క్ మ్యాటర్ శోధనల నుంచి ఇటీవలి ఫలితాలను 59వ రెన్ కాంట్రిస్ డియోరియోండ్–2025 సమావేశంలో ప్రదర్శించగా ఈ బహుమతిని ప్రకటించారు.

ఐఐటీ ఒలింపియాడ్‌లో సత్తా


సత్తా చాటిన విద్యార్థులు

గచ్చిబౌలి: ఐఐటీ ఒలిపియాడ్ పరీక్షలో 11 మంది విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ మాట్లాడుతూ.. అభ్యాస్ అకాడమీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వివిధ కేటగిరీలలో ఐఐటీ ఒలింపియాడ్ పరీక్షలలో 33 మంది విద్యార్థులు పాల్గొని మొదటి, రెండవ,మూడవ ర్యాంకులు సాధించారన్నారు.

నిత్యావసరాల అందజేత


నిత్యావసరాలు అందించిన బెటాలియన్ అధికారులు

గచ్చిబౌలి: చందానగర్‌లోని న్యూలైఫ్ అనాథ ఆశ్రమానికి కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ పోలీసులు చేయూత అందించారు. కమాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం 'సి' కంపెనీ యానువల్ రీఫ్రెషర్ కోర్సులో భాగంగా కంపెనీ సిబ్బందితో కలిసి అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథిరెడ్డి చేతుల మీదుగా బియ్యం, దుస్తులు, పండ్లు, వంటనూనె అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ ఆదినారాయణరెడ్డి, బీ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ వసూళ్లు రూ. 38 కోట్లు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ ఎర్లీ బర్డ్‌లో భాగంగా మంగళవారం నాటికి రూ.38 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఎర్లీబర్డ్ వసూళ్ల లక్ష్యం రూ.132 కోట్లుగా ఉన్నతాధికారులు నిర్దేశించారు. దీనితో సర్కిల్‌లో డాకెట్ వారీగా టార్గెట్‌తో ఎర్లీ బర్డ్‌లో భాగంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లకు కాలనీల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

చెరువు కలుషితం.. చేపలు మృత్యువాత



నష్టాలబారిన మత్స్యకారులు
గోపన్‌పల్లి చిన్నాపెద్ద చెరువులో చేపలు మృతి చెందడం రెండోసారి
మురుగునీటితోనే మృతి చెందాయంటున్న మత్స్యకారులు

రాయదుర్గం: చుట్టూరా భారీ బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల చెంతనే ఉన్న చెరువు కలుషితమవుతోంది. ఇదే విషయాన్ని రెండేళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మత్స్యకారులు వాపోతున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి చిన్నాపెద్ద చెరువు రోజురోజుకు కలుషితమవుతోంది. గత రెండ్రోజులుగా చెరువు కలుషితంతో చేపలు మృతి చెందుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. మృగశిర కార్తె కోసం ఏటా సుమారు 25 క్వింటాళ్ల చేపలు పెంచితే మొదటి సారి 10 క్వింటాళ్లు, రెండు రోజులుగా 15 క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి.

చెరువు చుట్టూ పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్న ఈ చెరువును సుందరీకరించాల్సిపోయి మురుగునీరు చేరేలా ఉండడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఆక్సిజన్ శాతం 2.6శాతం ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 7.6 ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే మా కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం స్పందించి తామనకు ఆదుకోవాలని కోరుతున్నారు.చెరువుకు ఆనుకొనే ఎస్టీపీని ఏర్పాటు చేసినా సమస్యలు తలెత్తడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సుందరీకరిస్తే మేలు..

చెరువులోకి మురుగు నీరు చేరకుండా డైవర్షన్ పైప్‌లైన్‌లు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం చెరువు మధ్యలోంచి వెళ్లిన మురుగునీటి పైప్‌లైన్‌ను కూడా మార్చి చెరువును సుందరీకరించి చుట్టూరా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చుట్టూ శాశ్వత ప్రాతిపదికన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. గతంలో వేసిన ఫెన్సింగ్‌ను జరుపుతూ స్థలాన్ని ఆక్రమించారనే ఆరోపణలు సర్వత్రా వినిపించాయి. అలా జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. చుట్టూ క్లీనప్‌డ్రైవ్ చేపట్టి, గ్రీనరీని పెంచి బెంచీలు, లైటింగ్ కూడా ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

నష్టాల బారిన పడుతున్నాం...



గోపన్‌పల్లిచిన్నాపెద్ద చెరువులో మురుగునీరు చేరడంతో చేపలు మృతితో రూ. లక్షల్లో నష్టపోతున్నాం. ఇంతకు ముందే రూ.15 లక్షల విలువ చేసే చేపలు మృతి చెందగా, తాజాగా రూ. 6 లక్షల విలువ చేసే చేపలు మృతి చెందాయి. మృగశిర కార్తెకు విక్రయించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలా మృతి చెందాడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి.

–రాజుముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గోపన్‌పల్లి

సుందరీకరించాలి



చెరువులో చేపల పెంపకం, విక్రయం ద్వారానే ఆదాయం సమకూర్చుకుంటున్నాం. కానీ అధికారుల దృష్టికి మురుగునీరు చేరకుండా చూడాలని కోరినా స్పందించలేదు. చెరువును సుందరీకరించి ఆహ్లాదపూరిత వాతావరణం కల్పించాలి. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, లైటింగ్ ఏర్పాటు చేయాలి.

–వీరస్వామి మత్స్యకారుడు, గోపన్‌పల్లి

మహిళా అభ్యున్నతికి కృషి


సర్టిఫికెట్లు అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: మహిళా అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. భెల్ ఎంఐజీ కాలనీలోని ఇందిరా గాంధీ మహిళా భవన్‌లో జనశక్తి సంస్థాన్ మహిళా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా శక్తి పథకం, వడ్డీలేని రుణాలు, స్కిల్ యూనివర్సిటీ వంటి వాటితో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.మోహన్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సావిత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరి, ఉరిటీ వెంట్రావ్, నర్సింగ్‌ఠాకూర్, ప్రవీణ్, సునీల్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో గచ్చిబౌలి క్రీడాకారుల హవా


ట్రోఫీ అందుకున్న విజేత జట్టు

గచ్చిబౌలి: స్పోర్ట్స్ ఓ ఫిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–10, 12 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గచ్చిబౌలి క్రీడాకారులు సత్తా చాటారు. నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహించిన టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలలు, ఫుట్‌బాల్ అకాడమీ క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–10 విభాగంలో 20 జట్లు పాల్గొనగా గచ్చిబౌలి టీమ్ స్పోర్టియమ్ ఎఫ్‌సీబీ ఏపై 4 గోల్స్ చేసి విజయం సాధించింది. అండర్–12 విభాగంలోనూ గచ్చిబౌలి టీమ్ ఫైనల్స్‌కు చేరి రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏటీజీ యూసీ8 ఎండీ ఏ సోనిబాలదేవి క్రీడాకారులు, కోచ్ రాంబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె మధు, స్టేడియం అథ్లెటిక్స్ కోచ్ ఎం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తానన్నారు. ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ దేవి, హార్టికల్చర్ డిపార్టుమెంట్ దాసు, ఎంటమాలజీ డిపార్టుమెంట్ నరసింహ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ నరేష్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, వాటర్‌వర్క్స్ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

దుబ్బాక ఎమ్మెల్యేపై కాంగ్రెస్ ఫిర్యాదు


ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం కూకట్‌పల్లి ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. త్వరలో స్పీకర్, గవర్నర్‌లకు ఫిర్యాదు చేస్తామని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేకల మైఖేల్, కొండల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డి, దేవ సహాయం, అక్బరుద్దీన్, రాజు ముదిరాజ్, కొమ్ము బాబు, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన గురు శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్‌ను మంగళవారం తెలంగాణ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ. ఎండి శైలజ రామయ్యర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ సింధు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఇందులో 30మంది కళాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన కళాకారులకు రూ.2వేల విలువైన టూల్ కిట్లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండిక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎండీ శైలజ రామయ్యర్ పాల్గొన్నారు.

13 మంది కెమిస్ట్రీ విద్యార్థుల ఎంపిక

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు ప్రముఖ ఔషధ సంస్థలో ఉద్యోగ అవకాశాలు పొందారు. వార్షికంగా 2.8 లక్షల వేతనంతో పాటు బీమా, గ్రాడ్యూటీ, ఇతర అలవెన్సులతో కూడిన ట్రైనీ ప్రోగ్రాంలో ఎంపికయ్యారు. తెలంగాణ లైఫ్ సెన్సెస్ స్కిల్లింగ్ ప్రోగ్రాంలో భాగంగా మొత్తం 13 మంది విద్యార్థులు సాయి లైఫ్ సైన్సెస్, అరాగెన్ లైఫ్‌సైన్సెస్ వంటి తదితర సంస్థలలో వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌తో పాటు సంవత్సరానికి సగటు వేతనం 2.8 లక్షలుగా ఉద్యోగం పొందారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కెమిస్ట్రీ విభాగాధిపతి డా. బి. సత్యనారాయణను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.వీ. నరసింహా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. పద్మావతి అభినందనలు తెలిపారు.


ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రొఫెసర్లు తదితరులు

ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లో వార్షిక అకడమిక్ ఫెస్ట్

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ ఆధ్వర్యం లో రాయదుర్గంలోని క్యాంపస్‌లో అయిదురోజులపాటు వార్షిక అకడమిక్ ఫెస్ట్ 'డిజైన్ సింక్' పేరిట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏడాది కాలంలో విద్యార్థులు తమలోని నైపుణ్యాలను చాటడానికి సంస్కృతి, సృజనాత్మకత, ఆవిష్కరణలను ఆవిష్కరించడానికి అవకాశం కల్పిస్తారు. ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ ఆధ్వర్యంలో 21వ తేదీన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏవోక్ స్టూడియో ఆధ్వర్యంలో చేనేత, వస్త్రాలపై ఏఐ ప్రభావం అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తారన్నారు.

ఇంజన్‌లో మంటలు

పల్సర్ దగ్ధం



గచ్చిబౌలి: ఇంజిన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి బైక్ దగ్ధమైన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన సయ్యద్(24) కేపీహెచ్‌బీలో ఉంటూ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గచ్చిబౌలి వినాయక్‌నగర్‌లో ప్రధాన రహదారిపై పల్సర్ బైక్ వెళుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సయ్యద్ బైక్‌ను ఆపి దూరంగా పరిగెత్తాడు. అంతలోనే మంటలు చెలరేగి దగ్ధమైంది.

రేపు బీసీల సమావేశం

కూకట్‌పల్లి: నియోజకవర్గ బీసీల సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు నాయకులు శివ ప్రసాద్, డి రమేష్, సీహెచ్ కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యా గ్రౌండ్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

బండి రమేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

కూకట్‌పల్లి: అంబేడ్కర్ జయంతి సందర్భంగా దయార్‌గూడలో నిర్వహించిన ర్యాలీలో గుర్రపు బగ్గీలో అంబేడ్కర్ చిత్రపటం కనిపించకుండా అడ్డుగా కూర్చున్న బండి రమేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ కూకట్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బగ్గీలో ఎవరి చిత్రపటం ఉందో చూసుకోకుండా బగ్గీ ఎక్కి కాలుమీద కాలు వేసుకొని ఫొటోలు దిగటం అంబేడ్కర్‌ను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటనపై అంబేడ్కర్ వాదులు స్పందించాలన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి ప్రభుత్వ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా 100 మంది క్షయ వ్యాధి బాధితులకు మెడికల్ ఆఫీసర్‌లు డా. పద్మావతి, డా. మమత పౌష్టికాహార కిట్లు అందజేశారు. చికిత్స, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. క్షయవ్యాధి నివారించడానికి ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలు అవసరమని అన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మోహన్, రామకృష్ణ, కల్పన, రాజు, ప్లాన్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో నాణ్యత ముఖ్యం


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

రాయదుర్గం: విద్యబోధనలో నాణ్యత ముఖ్యమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా అధ్యక్షుడు వీబీసింగ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 50 ఏళ్ల క్రితమే ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా భవిష్యత్ ఇంజినీర్లను తీర్చిదిద్దాలనే ఆలోచనలతో రూపు దిద్దుకున్న హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా నేడు ఆసియాలోనే ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుందని ఆయన వివరించారు. దేశంలో పలు రాష్ట్రాలు పోటీపడినా అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోనే ఈ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకొని 1981లో భూమిపూజ చేసి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. 45 ఏళ్లుగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా పనిచేస్తున్న వేలాది మంది ఇంజనీర్లకు ఇంజనీరింగ్ విద్యలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన సాంకేతిక విధానంపై ఓరియేంటేషన్ తరగతులు నిర్వహిస్తూ వారిలో నూతన ఉత్సాహానికి, దేశ అభివృద్ధికి 'ఎస్కీ' బాటలు వేస్తోందన్నారు. ఈ సమావేశంలో 'ఎస్కీ' అధికారులు సీఎస్‌కృష్ణప్రసాద్ రావు, ఆర్ వెంకట్‌రెడ్డి, చంద్రకళ, సాగర్, శ్రీధర్ బాబు, విద్యాసాగర్, అమర్‌నాథ్, లక్ష్మీకాంత రావు, డాక్టర్ రాజారావు, రాజశేఖర్‌రెడ్డి, సాయికిషోర్, అనితా అగర్వాల్, సయ్యద్ అజ్గర్ డాక్టర్ భరత్, ఆదినరేష్, సీహెచ్‌తిలక్, జి నరేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

'మిస్ అండ్ మిసెస్' సీజన్-2 పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ వేదికగా ఇటీవలే నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ ఈవెంట్ విజయవంతం కావడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనిలో భాగంగా మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ సీజన్–2ను ప్రకటించారు. రెండో సీజన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఫౌండర్ కిరణ్మయి అలివేలు, సీజన్–1 విజేతలతో కలిసి ఆవిష్కరించారు. ఔత్సాహిక యువ వనితలకు ఇది మంచి వేదికని కిరణ్మయి చెప్పారు. నిత్య జీవితంలోని ఆలోచనలు, ఆశయాలకు పెళ్లి ముగింపు కాదని, మరో అద్భుత ఆరంభం ఉందని అన్నారు. మగువ సౌందర్యాన్ని మరింత గ్రాండ్‌గా ప్రదర్శించడానికి ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో పలు ఫ్యాషన్ షోలు, బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొన్న అనుభవంతో, ఔత్సాహికులకు అవకాశాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలను ఫ్యాషన్ వేదికపై ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. అలాగే క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు, సామాజిక బాధ్యతతో కొన్ని సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ ఫౌండర్ కిరణ్మయి అలివేలు తెలిపారు. సీజన్–2 ప్రకటన సందర్భంగా మొదటి సీజన్ విజేతలుగా నిలిచిన వారంతా ర్యాంప్ వ్యాక్‌తో అలరించారు.



పేదలకు అండగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంగా మారాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని 272 మంది లబ్ధిదారులకు మంజూరైన 2 కోట్ల 72 లక్షల రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధురెడ్డి, పుష్ప, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, వెంకట్ రెడ్డి, షేక్ హుస్సేన్, ఆయా మండలాల తహసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయండి

పటాన్‌చెరు టౌన్: వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నివాసం వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, శ్రీధర్ చారి, మిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.